

నిర్మల్ నుంచి మియాపూర్‌కు సూపర్ లగ్జరీ బస్సు

నిర్మల్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నుంచి కూకట్‌పల్లి, మియాపూర్‌కు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కే.పండరి తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 11:15 నిమిషాలకు నిర్మల్ నుంచి బయలుదేరి మియాపూర్‌కు సాయంత్రం 04:30 నిమిషాలకు చేరుకుంటుందని, తిరిగి మియాపూర్ నుంచి సాయంత్రం 07:30 నిమిషాలకు బయలుదేరి రాత్రి 01:10 నిమిషాలకు చేరుకుంటుందన్నారు. ఈ సదావకాశాన్ని మియాపూర్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు సద్వినియోగపరచుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.



రోడ్లను ఆనుకొని అక్రమ నిర్మాణాలు చేయొద్దు

● మసూద్ ఆర్‌అండ్‌బీ డీఈఈ ఖానాపూర్

ప్ర : సబ్‌డివిజన్ పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆనుకొని పలువురు అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. వీరిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు...?

జ: ఆర్‌అండ్‌బీ రోడ్లను ఆనుకొని ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేసినా చర్యలు చేపడతాం. ఇదివరకే రోడ్లను ఆనుకొని వేసిన షెడ్లను తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి సహా ఆర్డీవోను లిఖితపూర్వకంగా కోరతాం.

ప్ర : పలుచోట్ల రోడ్లు దెబ్బతిన్నప్పటికీ మరమ్మతులు చేయడం లేదని చెబుతున్నారు. దీనిపై ఏమంటారు...?

జ: దెబ్బతిన్న రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. పలుచోట్ల కేజ్‌వీల్ ట్రాక్టర్లను ఉపయోగించడం ద్వారా రోడ్లు దెబ్బతింటున్నాయి. రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా ఇనుప చక్రాలకు తొడుగులు వాడాలి. రోడ్లపై ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేయకూడదు. రోడ్లను తవ్వాల్సిన పరిస్థితి వస్తే టీఎస్ రోడ్ కటింగ్ పోర్టల్‌లో అనుమతి పొందాలి.

ప్ర : అభివృద్ధి పనులు జరుగుతున్నాయా...?

జ: రెంకోని వాగుపై రెండు రోడ్లపై రూ.10 కోట్లతో వంతెనల నిర్మాణం, రూ. 18 కోట్లతో మందపల్లి - చందు నాయక్ తండా రోడ్డు, అదే రోడ్డుపై 2 వంతెనలు, రూ. 8 కోట్లతో సారంగాపూర్ - అక్కకొండ, చిట్యాల-నర్సింగాపూర్, ధర్మాజీపేట-పాత రేవోజీపేట్, ఆర్‌అండ్‌బీ రోడ్డు-నవాబ్‌పేట్ ఇలా మధ్య బీటీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కొన్నిచోట్ల పనులు జరుగుతుండగా, మరికొన్ని చోట్ల ఆయా కారణాలతో నిలిచిపోయాయి.

ప్ర :అటవీ శాఖ అనుమతులు వస్తున్నాయా?

జ:పెంబి మండలంలోని కిషన్ నాయక్ తండా నుంచి గుమ్మెన - ఎంగ్లాపూర్ వరకు గల రహదారిపై ఆరు కల్వర్టుల కోసం రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. పాండ్వాపూర్ నుంచి లక్ష్మీపూర్ వరకు 4 కిలోమీటర్ల బీటీ రోడ్డు, దిమ్మదుర్తి నుంచి సింగపూర్ వరకు 4 కిలోమీటర్ల బీటీ రోడ్డు, ఇటిక్యాల్ నుంచి సిరిచెల్మ వరకు 3కిలోమీటర్ల మేర బీటీరోడ్డు కోసం మొత్తం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. ఈ రోడ్డు పనులకు అటవీ శాఖ నుంచి అనుమతులు ఇంకా రాలేదు.

• ఖానాపూర్, ఆంధ్రజ్యోతి

రౌడీ షీటర్లపై నిఘా



- జిల్లా సంఘటనలపైనా సీరియస్
- అప్రమత్తమవుతున్న పోలీస్ శాఖ
- నేరచరితుల కార్యకలాపాలపై ఆరా
- స్టేషన్‌ల వారీగా అలర్ట్
- రంగంలోకి స్పెషల్ టీమ్‌లు





నిర్మల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నమోదైన రౌడీషీటర్లతో పాటు వివిధ కేసుల లో అరెస్ట్ అయి బెయిల్‌పై బయటతిరుగుతున్న వారి కార్యకలాపాలను తెలుసుకునేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ఇప్పటికే వీరిపై నిఘా కొనసాగుతున్నప్పటికీ వరుసగా జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో ఇక నుంచి పకడ్బందీగా నిఘా ఉంచబోతున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లాలోని కుబీర్ పోలీస్‌స్టేషన్ లో ఓ దుండగుడు కానిస్టేబుల్‌పై దాడి చేయడంతో పాటు రెండు రోజుల క్రితం నిర్మల్ పట్టణంలో ఓ ఆకతాయి మరో పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌పై దాడికి ప్రయత్నించిన సంఘటనలను సైతం పోలీస్ శాఖ సీరియస్‌గా తీసుకుంటుంది. దీంతో పాటు వారం రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ రౌడీ షీటర్ అక్కడి పోలీస్ కానిస్టేబుల్‌ను హత్య చేసిన ఉదంతంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు అన్ని పోలీస్ స్టేషన్లకు రౌడీ షీటర్ల విషయంలో అలర్ట్‌గా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేశారు. తమ తమ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన రౌడీషీటర్ల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనించి నిఘా సారించాలని మౌఖిక ఆదేశా లు వచ్చాయి. ఈ మేరకు మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం నిర్మల్ ఎస్పీ జానకిషర్మిలతో పాటు ఇతర పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి శాంతి భద్రతల విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సం దర్భంగా రౌడీషీటర్ల వ్యవహారం కూడా ఈ సమీక్ష సమావేశంలో ప్రత్యేకంగా చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. మొదట్లో కొంత మంది రౌడీషీటర్లు రియల్ ఎస్టేట్ దందాల్లో సెటిలెమెంట్లు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, సివిల్ పంచాయతీలు నిర్వహించడంతో పాటు బ్లాక్ మెయిలింగ్‌లాంటి చర్యలకు కూడా పాల్పడ్డ సంఘటనలున్నాయి. అయితే డాక్టర్ జానకిషర్మిల జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎప్పటికప్పుడు రౌడీషీటర్లపై నిఘా వేసి వారి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారు. రౌడీషీటర్లతో సంబంధాలున్న కొంత మంది పోలీసు సిబ్బందిపై కూడా ఆమె బది లీ వేటు వేసి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఎస్పీ ఎప్పటికప్పుడు తనదైన శైలిలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రౌడీషీ టర్ల కార్యకలాపాలపై ఆరాతీసి వారి కదలికలు, కార్యకలాపాలపై నిఘా సాధిస్తుండడంతో నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర చోట్ల రౌడీషీటర్ల అక్రమ వ్యవహారాలన్నీ కొంతకాలం నుంచి నిలిచిపోయాయి. కాగా కొద్దిరోజుల క్రితం భైంసాను అడ్డాగా చేసుకొని కొనసాగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ దందా రాకెట్‌ను ఎస్పీ చాకచక్యంగా ఛేదించారు. దీంతో పాటు సరిహద్దులోని నాందేడ్ జిల్లా అడ్డాగా సాగిన అక్రమ పశువుల రవాణా, గంజాయి దందా వ్యవహారాన్ని కూడా ఎస్పీ బట్టబయలు చేశారు. ఈ సందర్భంగా దాదాపు పదిమందిని అరెస్ట్ చేసి వారి మీద కేసులు నమోదు చేశారు.

నిఘావర్గాలు క్రియాశీలకం...

జిల్లాలో నమోదైన రౌడీషీటర్లతో పాటు పలు కేసులలో అరెస్ట్ అయి బెయిల్‌పై బయట తిరుగుతున్న వారి కార్యకలాపాలపై ఆరా తీసేందుకు ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో దాదాపు 506 మంది పై రౌడీషీట్లు ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడిస్తున్నారు. కాగా నిజామాబాద్ సంఘటన అనంతరం పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు అన్ని జిల్లాలను అప్రమత్తం చేసిన నేపథ్యంలో ఎస్పీ ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుడుతున్నారు. రౌడీషీటర్ల కదలికలపై పూర్తిస్థాయిలో ఆరా తీసేందుకు ఇంటెలిజెన్స్ విభాగాన్ని రంగంలోకి దింపారు. ఈ మేరకు ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సైతం నిర్మల్ జిల్లాలో ఎస్పీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రౌడీషీటర్లు, సంఘ విద్రోహశక్తుల వ్యవహారంపైనే ప్రత్యేకంగా చర్చించారు. నిజామాబాద్ సంఘటన అనంతరం ఎస్పీ ముందుగానే అప్రమత్తమై ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన కొంతమంది సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన రౌడీషీటర్లు ఏమి చేస్తున్నారన్న అంశంతో పాటు రోజువారి కార్యకలాపాలపై కూడా ఇంటెలిజెన్స్ విభాగం ప్రత్యేకదృష్టి సారించబోతున్నట్లు పేర్కొంటున్నారు. తాజాగా రౌడీషీటర్లపై ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇటీవల ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా అనే అంశంపై కూడా ఎస్పీ ఆరా తీశారు. ఎస్పీ పకడ్బందీ చర్యలతో రౌడీ షీటర్ల కార్యకలాపాలు సద్దుమణిగినట్లు కనిపిస్తున్నా పలు ఘటనల కారణంగా పోలీసులు మళ్లీ అప్రమత్తం అయ్యారు.

వరుస సంఘటనలపై సీరియస్...

నిర్మల్ జిల్లాలో కొద్ది రోజుల నుంచి పోలీస్ సిబ్బందిపై కొంతమంది దుండగులు దాడి జరపడం, అలాగే దాడికి ప్రయత్నించడం లాంటి సంఘటనలపై ఎస్పీ సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం కుబీర్ పోలీస్‌స్టేషన్‌లో ఓ దుండగుడు నేరు గా పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చి హెడ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. అలాగే రెండు రోజుల క్రితం నిర్మల్ పట్టణం లో ఓ దుండగుడు కానిస్టేబుల్, హోంగార్డుపై కూడా దాడికి ప్రయత్నించిన సంఘటనతో ఎస్పీ మరిం త కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇక నుంచి నిఘా విభాగాన్ని మరింత క్రియాశీలకం చేసే దిశగా ఎస్పీ చర్యలకు శ్రీకారం చుట్టారు.

అప్రమత్తం చేసిన ఐజీ...

రౌడీ షీటర్లు, సంఘవిద్రోహ శక్తుల పట్ల ఎప్పటికప్పుడు పోలీసులు అప్రమత్తంగా ఉండాలంటే మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం నిర్మల్ జిల్లాలోని పోలీస్ ఉన్నతాధికారులతో జరిపిన సమీక్షా సమావేశంలో హెచ్చరించడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలతో పాటు ఇతర కేసుల వివరాలను ఐజీ తెలుసుకున్నారు. రౌడీషీటర్లు, జులాయిగా తిరుగుతూ పలుకేసుల్లో అరెస్ట్ అయి బెయిల్‌పై బయట తిరుగుతున్న వారి కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూనే వారి ప్రవర్తనలో మార్పు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఐజీ జిల్లా పోలీస్ అధికారులకు సూచించారు.

ఈవీఎం గోదాం తనిఖీ



ఈవీఎం గోదాంను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, అధికారులు సర్ఫరాజ్, రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

● అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మామడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం మామడ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం, మంజూరైన నిధులు, పనుల పురోగతి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజేశ్వర్, డీఈఈ గంగాధర్, మండల ప్రత్యేక అధికారి రాజ నర్సయ్య, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో ఉపేందర్, ఏఈ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి వద్ద నిత్యహారతి

బాసర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాసర గోదావరి ఘాట్ వద్ద కార్తీకమాసం సందర్భంగా ప్రతి రోజు నిత్య హారతి కార్యక్రమం నిర్వహించనున్నటు ఆలయ అధికారులు తెలిపారు. గోదావరి ఘాట్‌నెం.1 వద్ద గల శ్రీ సూర్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద ప్రతి రోజు సాయంత్రం 6.30గంటలకు గోదావరికి నిత్యహారతి నిర్వహించనున్నారు. అదే విధంగా ఆలయంలోని దేవస్థాన మండపంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నారు.

కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

▶▶ కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరిధాన్యం కొనుగోలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద నిర్వాహకుల సమాచారం, టెంట్, తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. రైతులకు వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 9182958858ను ప్రదర్శించేలా ప్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ పూర్తిచేయాలని వివరించారు. సరిపడినంత మంది సిబ్బం ది, కూలీలు, సరిపడినన్ని లారీలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సరిపడినన్ని తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, టార్పాలిన్‌లు, గన్ని సంచులు ఉంచుకోవాలన్నారు. అధికారులు నిరంతరం వరిధాన్యం కొనుగోలు ప్రక్రియపై పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని వివరించారు. అధికారులు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను తనిఖీలు చేస్తూ, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతుందో లేదో చూడాలన్నారు. రోజువారీగా వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను రోజువారీగా నివేదికలను తమకు అందజేయాలని తెలిపారు. సన్న, దొడ్డు రకం కొనుగోలు కేంద్రాలు వేరువేరుగా ఏర్పాటు చేయాలన్నారు. రైతుల కు నిర్ణీత గడువులోగా డబ్బులు జమ చేసేలా అధికారులు చర్య లు తీసుకోవాలని చెప్పారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, పౌర సరఫరా ల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, డీఆర్డీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, వరి ధాన్యం కొనుగోలు కేం ద్రాల నిర్వాహకులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మతోన్మాదులను అడ్డుకోవడంలో కాంగ్రెస్ విఫలం



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న రితేష్ రాథోడ్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఖానాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మతోన్మాదశక్తులను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 'గో' రక్షకుడు ప్రశాంత్‌పై జరిపిన కాల్పులను నిరసిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో శాంతియుతంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకొని పోలీసులతో బీజేపీ నేతలను అరెస్ట్ చేయించడం ఈ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. మతోన్మాద మూకలు బహిరంగంగా తుపాలకులతో కాల్పులు జరుపుతున్న ఓ వర్గం ఓట్లను దండుకోవడం కోసం ఈ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండి హిందువులను అవమానిస్తోందన్నారు. 'గో' రక్షకుడు ప్రశాంత్‌పై

▶▶ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

కాల్పులు జరిపిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గోహత్యలను ప్రభుత్వమే చిత్తశుద్ధితో అడ్డుకోవాలన్నారు. లేని పక్షంలో జరిగే పరిణామాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నల్ల రవీందర్‌రెడ్డి, మదిరే శ్రీను, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్, ప్రధాన కార్యదర్శులు జెట్టి సురేందర్, దాసరి శ్రీను, నాయకులు బత్తుల నారాయణ, కే. ప్రశాంత్, పుప్పాల పవన్, కంతి లింబాద్రి, ఎనగందుల నారాయణ, రాపెల్లి రవీందర్ ఉన్నారు.

మతోన్మాదులను అడ్డుకోలేక అరెస్టులా...?

నిర్మల్‌చైన్‌గేట్ : మతోన్మాదులను అడ్డుకోలేక అరెస్టులా? సిగ్గుచేటు అని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు నిర్మల్ బీజేపీ నాయకులతో కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'గో' రక్షకుడు ప్రశాంత్‌పై కాల్పులు జరిగిన ఘటనకు నిరసనగా... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే, అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్భాగ్యకర విధానాలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శుడు యాతలం చిన్నారెడ్డి, కరిపే విలాస్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, జిల్లా కార్యాలయ కార్యదర్శి రాచకొండ సాగర్, జిల్లా మీడియా కన్వీనర్ బుర్ర రమేష్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు మేడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, ఆడెపు సుధాకర్, కమల్ నయన్, శ్రావణ్ రెడ్డి, నిర్మల్ పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, ప్రధాన కార్యదర్శి విజయ్ గిల్లి పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన



క్షేత్ర ప్రదర్శనలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ముథోల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన 6, 7వ తరగతి విద్యార్థులు క్షేత్ర పరిశీలనలో భాగంగా ముథోల్‌లోని పోస్టాఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ గంగయ్య, పోస్ట్ మ్యాన్ పంకజ్‌లు పోస్ట్ ఆఫీస్ విధుల గురించి కూలంకషంగా వివరించారు. విద్యార్థులకు గల సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల వెంట ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆలయానికి మంగళవాయిద్యాల అందజేత



మంగళవాయిద్యాలను అందిస్తున్న దృశ్యం

బాసర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాసర శ్రీ జ్ఞానసరస్వతి అమ్మవారికి మంగళవాయిద్యాలు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన భక్తులు శనగశెట్టి జగదీష్, బొబ్బిలి, ప్రసాద్ కుటుంబ సభ్యుల తరుపున అమ్మవారి అభిషేక సమయంలో వినియోగించుకునేందుకు మంగళ వాయిద్యాలు, ఒక డోలు, రెండు సన్నాయిలను భక్తులు ఆలయానికి విరాళంగా అందజేశారు. వీటి విలువ రూ.44వేల 2వందల రూపాయలు ఉంటుందని ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్ తెలిపారు. వీరి వెంట ఆలయ సూపరిండెంట్ లక్ష్మణ్, సన్నాయి డోలు భక్తులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్

స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు

▸▸ ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్

తలమడుగు, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం అర్హులైన స్వయం సహాయక సంఘ సభ్యులకు రూ.లక్ష వరకు రుణాలను అందిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని వసుంధర మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన సభ్యుల సమావేశంలో ఏపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు స్వయం శాఖల సంఘాల ద్వారా రూ. లక్ష వరకు రుణాలను అందిస్తున్నామని అన్నారు. అలాగే గ్రామాల్లోని ప్రతీ మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండేలా ఐకేపీ సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక రుణాలను అర్హులైన సంఘాలకు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతీ సంఘం సభ్యురాలు బ్యాంకు లింక్ లింకేజీ ఉండాలని సూచించారు. స్వయంసహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు సబ్సిడీపై రుణాలను అందిస్తామన్నారు. గతంలో తీసుకున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు చెల్లిస్తే మిగతా సభ్యులకు రుణాలు అందించే అవకాశం కలుగుతుందన్నారు. సంఘాల్లో అవకతవకలు జరగకుండా ఎప్పటికప్పుడు ప్రతినెలా సమావేశం ఏర్పాటుచేసి సంఘం లావాదేవీలపై చర్చించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో శంకర్, ఐకెపి సీసీలు స్వామి, రామ్‌రెడ్డి, సమత, ఆశన్న, స్వయం సహకార సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ ఇళ్లకు భూమిపూజ

భీంపూర్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజలలో ఆత్మచైర్మన్ కామన్ అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి రమేష్, అన్ను పటేల్, పెండ్యపు కృష్ణ, మతీన్ పటేల్ కలిసి గురువారం కొలం గిరిజనుల కోసం పీవీటీజీ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కామన్ అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. పథకాలను అరులైన అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మరసకోల మనోహర్, ఆత్రం రామేశ్వర్, సోయం కాంతారావ్, రేణుకుంట్ల శ్రీనివాస్, మురళి యాదవ్, జంటల విఠల్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ బడుల్లో వందశాతం ఉత్తీర్ణత తేవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షి షా



పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రతీ పాఠశాల సిబ్బంది సమిష్టిగా కృషిచేయాలని కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పదో తరగతి ఫలితాల మెరుగుదలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏపీవో, జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి ఖుష్బూగుప్తాతో కలిసి కలెక్టర్ విద్యార్థుల హాజరు, ఫలితాల మెరుగుదల, బోధన నాణ్యత, శాతం పెంపు చర్యలపై విస్తృతంగా చర్చించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో సమగ్రమైన ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది ఎస్ఎస్‌సీ ఫలితాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత ఎక్కువ శాతం పెంచే దిశగా ఉపాధ్యాయులు సమిష్టిగా కృషిచేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపేలా ప్రతీ పాఠశాలలో మోటివేషన్ సెషన్‌లు, కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు ఏర్పాటు చేయాలని, నవంబర్ 1 నుంచి ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించి జనవరి10 నాటికి సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రాండ్ టెస్ట్-1, గ్రాండ్ టెస్ట్-2 నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనావేయాలని సూచించారు. ఇంగ్లీష్, తెలుగు మాధ్యమ పాఠశాలల్లో బోధన నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతీ పాఠశాలలో విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా ఉపాధ్యాయులు, ఎంఈఓలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్పోర్ట్స్ కిట్లను జిల్లా కలెక్టర్, ప్రాజెక్టు అధికారి పంపిణీ చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు గజానన్, సుజాత్ ఖాన్, జగన్, ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్‌లు, ఉపాధ్యాయులు, ఆయా అధికారులు పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన గజేందర్

నేరడిగొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డిని గురువారం మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారితో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గ పరిధిలో గల పోలీసులకు క్వార్టర్స్ మంజూరుతో పాటు శిథిలావస్థకు చేరిన పోలీసు స్టేషన్‌లను పునఃనిర్మించాలని డీజీపీని కోరారు.

గిరిజన నిరుద్యోగుల కోసం డిజిటల్ జాబ్ వెబ్‌సైట్

ఉట్నూర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువత కోసం డిజిటల్ జాబ్ వెబ్‌సైట్ ఏర్పాటు చేశామని, ఈ వెబ్‌సైట్ ద్వారా నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు పొందాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా గురువారం ఒక ప్రకటనలో కోరారు. గిరిజన సంక్షేమశాఖ (ట్రైకార్), పరిశ్రమలు, వాణిజ్య శాఖతో కలిసి ఒక డిజిటల్‌ప్లాట్‌ఫాం ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఈ వెబ్‌సైట్ నిరుద్యోగులకు పరిశ్రమల శాఖకు వారధిగా పని చేస్తుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగులు వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకుంటే వారి విద్యార్హతలను బట్టి ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు విద్యార్హత పత్రాలు జిరాక్సులు తీసుకొని ఐటీడీఏ ప్రధాన కార్యాలయంలోని రూమ్ నెంబర్ 7లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల విధుల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ప్రజాహిత కార్యక్రమాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు పోలీసులు వినియోగించే ఆయుధాలు, అత్యవసర సమయంలో ఉపయోగించే విధులపై ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. దాదాపు 600 మంది విద్యార్థులకు పోలీసుల విధులు, వారి ఆయుధాలు, బాంబులను కనుగొనే పని ముట్లు, జాగిలాల పనితీరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా



జాగిలాల పనితీరును వివరిస్తున్న ఎస్పీ

ఎస్పీ స్వయంగా విద్యార్థులకు ఆయుధాల పనితీరు, వేలిముద్రలతో నిందితులను కనుక్కునే విధానం, పోలీసు వ్యవస్థలో జాగిలాల పనితీరును వివరించారు. పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ, వారుచేసిన త్యాగాలను గుర్తుచేస్తూ, వారం రోజులు పాటుగా చేసే ప్రజాహిత కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పాల్గొనాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. ఆయుధాలను వివరించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తయారీ కేంద్రాలు, తయారుచేసే సంస్థల గురించి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్, పటన సీఐలు బి.సునీల్, కె.నాగరాజు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళీ, ఎన్. చంద్రశేఖర్, రిజర్వ్ సిబ్బంది, ఫింగర్ ప్రింట్, కమ్యూనికేషన్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది ఉన్నారు.

ఇళ్లలోనే పంట దిగుబడులు!

(5వ పేజీ తరువాయి...)

తెలుస్తోంది. పంటలు చేతికి రాగానే దళారులు గ్రామాల్లో సంచరిస్తూ రైతుల నుంచి కిలోల కొద్దీ పంటలను కొనుగోలు చేస్తున్నారు. నగదును ఆశ చూపుతూ ధరల్లో భారీ కోతలు విధిస్తున్నారు. అలాగే తూకంలో మోసం చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. ఇంత జరుగుతున్న మార్కెటింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

పంట కుప్పల పైనే కునుకు..

గ్రామ సమీపంలోని మైదానాలు, రోడ్లపై పంటలను ఆరబోస్తున్న రైతులు నిత్యం రాత్రిళ్లు పంటకుప్పల పైననే కునుకు తీస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఉదయం పంటలను ఆరబోయడం రాత్రి వేళల్లో కుప్పలు చేసి పాల్తిన్ కవర్‌లు కప్పుతూ తడిసిపోకుండా జాగ్రత్త పడతున్నారు. అయినా కురుస్తున్న భారీ వర్షాలకు వర్షపు నీరు చేరి పంట దిగుబడులు తడిసిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రోడ్లపై పంటలను ఆరబోయడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడతున్నారు. ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. పంట చేతికి వచ్చిన వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తే రైతుల కు ఎన్నో ఇబ్బందులు తప్పనున్నాయి. చిన్న సన్నకారు రైతులు ఇళ్లలో పంటలను నిల్వ చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు పడతున్నారు. ఇకనైనా ప్రభుత్వం పంట కొనుగోలను ప్రారంభించి వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

బజార్‌హత్నూర్ పీహెచ్‌సీ తనిఖీ

బజార్‌హత్నూర్,అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ మనోహర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో జరుగుతున్న పీఎన్‌సీ, ఎన్‌సీడీ స్ర్కీనింగ్ టెస్టుల గురించి, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది అన్నివేళల్లో అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూఇచంచారు. అనంతరం రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్ప, రవీందర్, సూర్యప్రకాష్, సుశీల, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

తలమడుగు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అల్లూరి సందీప్‌రెడ్డి గురువారం మండలంలోని ఖోడద్‌ఉందం, సుంకిడి, హస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సుమారు రూ.25వేల విలువైన టై, బెల్టులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రతీఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షు డు శ్రీకాంత్ పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక

భైంసా రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేగాం సబ్‌స్టేషన్‌లో శుక్రవారం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. భైంసా, కుబీర్, కల్లూర్, తానూర్ మండలాల్లోని ప్రజలు విద్యుత్ సమస్యలపై నిర్వహించిన వేదికలో పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

కిసాన్ కపాస్‌పై అవగాహన



వెంకూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో గణేష్

కుంటాల, అక్టోబరు, 23 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకూర్‌లో గురువారం రైతులకు కిసాన్ కపాస్ యాప్‌పై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అంతేగాకుండా రబీసీజన్‌లో సాగుచేసే మొక్కజొన్న పంటలో యూరియా వాడకం తగ్గించాలని రైతులకు అవగాహన కల్పించారు. అంతేగాకుండా నానోయూరియా, నానో డీఏపీలను పిచికారి చేస్తే రైతులకు లాభం చేకూరే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో గణేష్, రైతులు తదితరులు ఉన్నారు.

నీట్‌లో మెరిసిన ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థిని



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల యాజమాన్యం

నిర్మల్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ గ్రామానికి చెందిన రాథోడ్ సవిత వినోద్‌ల కుమార్తె రాథోడ్ స్నేహ నీట్‌లో ప్రతిభ చాటింది. తన విద్యాభ్యాసం నాలుగో తరగతి నుంచి పదోతరగతి వరకు ఎస్ఆర్ ప్రైమ్‌స్కూల్‌లో చదివి, తర్వాత తన ఇంటర్మీడియట్ విద్యను ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పూర్తిచేసింది. గత సంవత్సరం జరిగిన నీట్‌లో మంచి మార్కులు సాధించి గవర్నమెంట్ మెడికల్ కళాశాల మెదక్‌లో సీటు సంపాదించి తల్లిదండ్రులకు, ఎస్ఆర్ విద్యాసంస్థలకు గర్వకారణంగా నిలిచింది. విద్యార్థిని మాట్లాడుతూ... తన విజయం కోసం నిరంతర సహకారం అందించిన ఎస్ఆర్ ఉపాధ్యాయులు, లెక్చరర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ యాజమాన్యం విద్యార్థినిని ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి నగేష్ యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

గోవిజ్ఞాన రాష్ట్ర పరీక్షలకు ఎంపిక

కుంటాల, అక్టోబరు 23 : (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాల నుంచి గో విజ్ఞాన రాష్ట్ర స్థాయి పరీక్షలకు 9 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజు తెలిపారు. తెలంగాణ ప్రాంత గో సేవా విభాగం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వీ. స్వప్న, ఎస్. శ్రీనిధి, శ్రీదివ్య, ఆర్. విద్య, జే. మనీషా, బీ. ప్రణయ, కే. అవంతిక, ఆర్థిక, గుణశ్రీ ప్రతిభ కనబరచగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, వారి తల్లిదండ్రులు వారిని అభినందించారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం

▸▸ అమరవీరుల వారోత్సవాల్లో నిర్మల్ పోలీసుల సరికొత్త ప్రయత్నం

▸▸ ఇరవై మంది హోంగార్డుల పిల్లలకు చేయూత

నిర్మల్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన పోలీసు కుటుంబంలో జన్మించిన నవీన్ స్థాపించబడిన నవీన్ గోల్డ్, బ్రదర్స్ వారు ఒక్కో విద్యార్థికి చదువులకు ఉపయోగపడేలా రూ. 10,000ల సహాయం చేయడానికి సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చారు. పోలీస్ అమరవీరుల స్మారక దినం వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డు కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన 20 మంది విద్యార్థులకు, గతంలో చనిపోయిన హోంగార్డుల ప్రతిభావంతులైన పిల్లలకు ఒక్కొక్కరికి రూ. 10,000ల విలువైన చెక్కులను ఎస్పీ డా.జి. జానకిషర్మిల ఆధ్వర్యంలో నవీన్ జువెలర్స్ యాజమాన్యం వారు అందజేశారు. ఇందులో జాదవ్ దివ్య అనే విద్యార్థిని నీట్‌లో 485 మార్కులు సంపాదించి, ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతుంది. ఆర్.లావణ్య అనే విద్యార్థిని ఇంటర్మీడియట్‌లో గ్రేడ్ ఏ సంపాదించి ఐఐటీ మొదటి సంవత్సరం చదువుతుంది. ఇంకొక విద్యార్థిని మెంగ అనన్య 8వ తరగతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ సీటు సంపాదించింది. ఆరుగురు విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రస్తుతం బీటెక్ చదువుతున్నారు. ఒకరు ఎల్ఎల్‌బీ, ఒకరు ఫార్మసీ, ఒకరు డిగ్రీ, 8 మంది విద్యార్థులు ఎస్ఎస్‌సీలో మెరిట్ గ్రేడ్ సంపాదించి ఇంటర్ చదువుతున్నారు. ఈ సందర్భంగా



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

ఎస్పీ మాట్లాడుతూ... ఈ గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చి, పేద పోలీసు కుటుంబాల పిల్లలకు ఆర్థిక సహాయం చేసిన నవీన్ జువెలర్స్ యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. నవీన్ జువెలర్స్ యజమాని మాట్లాడుతూ... నేను ఒక పోలీస్ కుటుంబానికి చెందిన వ్యక్తిని. చిన్నప్పటి నుంచి పోలీస్ వాతావరణంలో పెరిగిన కారణంగా, మా పోలీస్ సిబ్బంది - కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఎదుర్కొనే కష్టాలు, బాధలు నాకు తెలుసు. అందుకే మా పోలీసులు కుటుంబాల పిల్లలను ప్రోత్సమించాలనే ఆలోచనతో ఎస్పీంతో చర్చించి ఈ ఆలోచనను అమలు చేశానని తెలియజేశారు.

చిన్నారిని ఆదుకోండి

▸▸ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో గతంలో ప్రమాదం

▸▸ ఆస్పత్రి ఖర్చులు పెరిగాయని బాధితుల ఆవేదన



చికిత్స పొందుతున్న శాన్విక

నర్సాపూర్(జి), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో జరిగిన ఓ ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. వంట కార్మికురాలి నాలుగు సంవత్సరాల కూతురు శాన్విక వేడి పప్పు, గంజి పాత్రలో పడి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన విద్యాలయంలోని భద్రతా లోపాలను, నిస్సహాయ కార్మికుల కుటుంబాల పట్ల ఉన్న అలసత్వాన్ని బహిర్గతం చేసింది.

రోజుకు రూ.లక్ష ఖర్చు...భరించలేని భారం...

ప్రస్తుతం శాన్విక ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. నిరుపేద వంట కార్మికురాలి కుటుంబానికి ఈ చికిత్స భారం మోయలేనిదిగా మారింది. బాలిక తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ తమ బిడ్డను బతికించుకోవడానికి రోజుకు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే తమకు ఈ భారం మోయడం అసాధ్యమని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రెండు చేతులు జోడించి వేడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో తమ కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలని వారు కోరారు.

అధికారుల చర్యలు కేవలం నామమాత్రమేనా...?

ప్రమాదంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌వో) వీణకు షోకాజ్ నోటీస్ జారీచేసి, పూర్తి వివరణ కోరారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) భోజన, పర్యవేక్షణ లోపాలను దృష్టిలో ఉంచుకుని, గతంలో పనిచేసిన సెక్టోరల్ ఆఫీసర్ స్థానంలో నవీన జ్యోతి, రమాదేవి, అనే కొత్త అధికారులను నియమించినట్లు తెలిపారు. అయి తే అధికారుల బదిలీలు, వివరణ కోరడం వంటి పాలన పరమైన చర్యలు మాత్రమే చాలవని స్థానికులు, ప్రజా సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న శాన్విక వైద్య ఖర్చుల భారాన్ని ప్రభుత్వమే భరించాలని పలువురు కోరుతున్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కేజీబీవీలలో పని చేసే సిబ్బంది పిల్లల భద్రత కోసం ప్రత్యేక శిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. వంట గది ప్రాంతంలో భద్రతా ప్రమాణాలు కట్టుదిట్టం చేయాలని వారంటున్నారు. నాలుగేళ్ల శాన్వికకు మెరుగైన చికిత్స అందించి, ఆ నిరుపేద వంటగ కార్మికురాలి కుటుంబానికి అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని స్థానికులు అంటున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న భైంసా సీఐ

కుభీర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రమైన కుభీర్‌లోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కుభీర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ నైలు, ఎస్సై కృష్ణారెడ్డి మాట్లాడుతూ డయల్ 100, షీటీమ్, సైబర్ నేరాలు గురించి వివరించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, 9ఎంఎం పిస్టల్, ఏకే 47 పనితీరు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారామ్, డి. సాయన్న, క్రాంతికుమార్, పార్థసారధి, నవీన్‌కుమార్, సాయిశ్యాం ఉన్నారు.

లక్ష్మణచాందలో పోలీసు ఓపెన్‌హౌజ్



పోలీస్‌స్టేషన్‌లోని ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న సీఐ గోవర్ధన్ రెడ్డి

లక్ష్మణచాంద, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఓపెన్ హౌజ్ (ఆయుధాల ప్రదర్శన) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్ వర్మ, హెడ్ కానిస్టేబుళ్లు గంగాధర్, శంకర్, కానిస్టేబుళ్లు కిరణ్, భీమన్న, సంతోష్, రఘు, అశోక్, ప్రతిభ, పల్లవి, నిషిత, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషిచేద్దాం

● నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

నిర్మల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు వచ్చే అత్యంత ప్రమాదకరమైన వ్యాధి పోలియో. పోలియో అనే ది వైరస్ వల్ల సంక్రమిస్తుంది. ఈ వైరస్ చిన్నారుల నాడీ వ్యవస్థ దెబ్బతీసి కండరాలు బలం కోల్పోయే స్థితికి తీసుకువస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులకు ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమించడమే కాకుండా తీవ్రమైన దుష్ఫలితాలను చూపిస్తాయి.అందుకే అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయిస్తే అంగవైకల్యం నుంచి వారిని రక్షించడంతో పాటు పోలియోరహిత సమాజంకోసం కృషిచేద్దామని ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ కలిసి అక్టోబరు 24ను పోలియో రహిత నివారణ దినం నిర్వహిస్తుంది. అయితే 2014లోనే భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా డబ్ల్యుహెచ్‌వో ప్రకటించింది. జిల్లాలో సైతం గత 15 సంవత్సరాల నుంచి కేసుల నమోదు పోలియోభారిన పడిన చిన్నారుల సంఖ్య జీరోగానే నమోదవుతుందని వైద్యఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వారానికి రెండుసార్లు పోలియో టీకాలు వేస్తున్నామని పుట్టిన ప్రతి చిన్నారికి టీకాలు వేసేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

గోవింద్‌నాయక్, పశువైద్యాధికారి, ఇచ్చోడ

ఫేస్‌టుఫేస్



ప్రశ్న:గాలికుంటువ్యాధి అంటే ఏమిటి?ఏసీజన్ లో ఈ వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి?

జవాబు: గాలికుంటు వ్యాధి అనేది పశువులకు వచ్చే ఒక అంటువ్యాధి. ఇది పికార్నో వైరస్ వలన సోకుతుంది. పశువులకు ఈ వ్యాధి సోకడం వలన మరణాలశాతం తక్కువ అయినప్పటికీ పశువుల్లో ఉత్పాదకశక్తి, పునరుత్పత్తి శక్తి సామర్థ్యం కుంటు పడుతుంది. ముఖ్యంగామార్చి,ఏప్రిల్,ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పశువులకు ఈవ్యాధి ఎక్కువగా సోకుతుంది.

ప్ర:గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు ఏలాంటి చికిత్స అందించాలి?

జ: వ్యాధి సోకిన పశువులను అన్ని పశువులకు దూరంగా ఉంచి పుండ్లను పోటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పూయాలి. వెంటనే సమీపంలో పశువైద్యున్ని సంప్రందించి చికిత్స అందించాలి.

ప్ర: నివారణ చర్యలు ఎలా చేపట్టాలి?

జ:గాలికుంటు సోకిన పశువులకు సంబంధించిన పశువులపాకను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.ఏడాదికి రెండుసార్లు తప్పకుండా నివారణ టీకాలను పశువులకు వేయించాలి.ఈవ్యాధి పట్ల పాడిరైతులు అవగాహన కలిగి ఉండాలి. పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆరు నెలలకోసారి ప్రతీగ్రామంలో నిర్వహించేఉచిత గాలికుంటు పశువైద్యశిబిరాలను సద్వినియోగం చే సుకుని పాడిరైతులు ఆర్థికంగా నష్టపో కుండా జాగ్రత్తలు పాటించాలి.

ప్ర: వ్యాధి లక్షణాలేంటి?

జ: పశువులు నీరసించిపోయి చితికిపోతాయి. మేత, నీరు తీసుకోక నీరసించి చనిపోవడం. పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడంతో పాటు వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వేంటనే గాలికుంటు నివారణ టీకాలను పశువులకు వేయించాలి.

- ఇచ్చోడ, ఆంధ్రజ్యోతి

గుండెపోటుతో సాయిబాబా ఆలయ అర్చకుడి మృతి



సాయిలింగి(ఫైల్)

తలమడుగు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సాయిలింగి సాయిబాబాఆలయ ప్రధాన అర్చకుడు కిషన్ పంతులు గురువారం గుండె పోటుతో మృతి చెందినట్లుగ్రామస్థులు తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో ఆలయం నిర్మించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు 25 సంవత్సరాల నుంచి ఆలయంలో ప్ర.దాన అర్చకుడిగా సేవలు అందించారన్నారు. ఆల యానికి ఎవరు వెళ్లిన ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరించేవారని ఈ సందర్భంగా గ్రామస్తులు గుర్తు చేశారు. అంతేకాకుండా ప్రతిఒక్కరిని ఆధ్యాత్మిక మార్గం లో నడిపించేందుకు ఎంతగానో కృషి చేశారని పేర్కొ న్నారు.ఆయన అకాల మృతి తీరనిలోటని సాయిబా బా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దెబ్బడి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. పూజారివారి కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు పేర్కొన్నారు.

పగిలిన ఏటీఎం అద్దాలు

ఏటీఎంల అద్దాలు పగులగొట్టిన దుండగుడు

ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో పక్కపక్కనే ఉన్న ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంల డోర్ల అద్దాలు పగలగొట్టిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మ.ధ్యాహ్నం సమయంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి రాళ్లతో ఈ అద్దాలను పగలగొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా ఆందోళన నెలకొంది.

ఇబ్బందికరంగా మారిన రోడ్లపై ఆటోలు

» రోడ్ల పైన ఆటోలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు, విద్యార్థులు, ప్రజలు



న్యూ బస్సు స్టాండ్ ముందు రోడ్డుపై నిలబెట్టిన ఆటో

ఉట్నూర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రం లోని ప్రధాన రోడ్లపైన ప్యాసింజర్ ఆటోలు నిలబెడుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఉట్నూర్ మండల కేంద్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్నప్పటికీ రోడ్ల పైన వారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా,న్యూబస్టాండ్, ఎన్టీఆర్ చౌరస్తాతో పాటు అంగడి బజార్ ప్రాంతంలో ఆటోలురోడ్ల పైన పెడుతుండడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు, కార్లు, జీపులలో వెళ్లే వారితోపాటు ద్విచక్ర వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడతున్నారు. మంచిర్యాల ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై బస్టాండ్ ఎదురుగా రోడ్డుపైన ఆటోలు నిలబెట్టి ప్రయాణికుల కోసం వేచి చూడడంతో రోడ్డు పైన వెళ్తున్న వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వాహనానికి సైతం రోడ్డుపై ఆటోలు నిలబడి ఉండడంతో 10 నిమిషాల పాటు ఆటోలో వెళ్లే వరకు అధికారి వాహనం నిరీక్షించాల్సి వచ్చింది. ఇదేపరిస్థితి అంబేద్కర్ చౌరస్తాలో కూడా ఏర్పడుతుండాడంతో బస్సులలో దిగే ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతూ రోడ్డు ప్రమాదాలకు కూడా గురి అవుతున్నారు.అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు పూర్తిగా ఎత్తు నదలుగా ఉండడంతో పాటు స్పీడ్‌బ్రేకర్ ఉండడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు పడిపోతున్నారు.స్పీడ్‌బ్రేకర్లకు రంగులు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చేవాహనదారులు స్పీడుగా వచ్చి సడన్ బ్రేకులు వేస్తూ ఇబ్బందు లు పడతున్నారు.ఉదయం, మధ్యా హ్నం, సాయంత్రం సమయాల్లో విద్యా సంస్థలకు,పాఠశాలలకు,ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లివచ్చే విద్యార్థులు ఉద్యోగులు, ప్రజలు రోడ్డు పైన ఆటో లు నిలబడి ఉండడంతో ఇబ్బందులు పడతున్నారు.పోలీసులు గతంలో ట్రా ఫిక్ నియంత్రణ కోసంన్యూబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తాలో ప్రత్యే కంగా హోంగార్డులను ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకునేవారు.ప్రస్తుతం ట్రాఫిక్ నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు లేక పోవడంతోఆటోలు,వాహనదారులు ఇష్టం వచ్చిన రీతిలో రోడ్లపైవాహనాలు నిలుపుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు ట్రాఫిక్ నియంత్రణ కోసం చర్యలు తీసుకొని, ప్రమా దాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ పదో వార్షికోత్సవ వేడుకలు

» నేటి నుంచి ప్రారంభమైన అయ్యప్ప దేవాలయ పదో వార్షికోత్సవ వేడుకలు
» సర్వంగా సుందరంగా ముస్తాబైన ఆలయం » ఏర్పాట్లు చేపట్టిన ఆలయ నిర్వాహణ కమిటీ



ముస్తాబైన అయ్యప్ప దేవాలయం

భైంసా,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప దేవాలయం పదో వార్షికోత్సవ వేడుకలకు సర్వంగా సుందరంగా ముస్తాబు అయ్యింది. శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు కొనసాగనున్న వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చేందుకు గాను ఆలయకమిటీ ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులు అధిక సంఖ్యలో వేడుకలకు హాజరు కానున్న దృష్ట్యా ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టారు.ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలన్నింటిని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో,పూలతో అలంకరించారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆలయంలో నాలుగు రోజుల పాటు శ్రీ లక్ష్మీ గణపతి శ్రీ రుద్ర సహిత చండీ సప్తశతి యాగ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మంత్రి సాయినాథ్, యాగ బ్రహ్మ బాలాజీ శర్మ (బాసర), వేద పండితులు వెంకటేశ్వర శర్మ (తిరుపతి) చేతుల మీదుగా వార్షికోత్సవ, యాగ మహోత్సవ కార్యక్రమాలు జరుగనున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటలకు గణపతిపూజ,యాగశాలప్రవేశం, చండీహోమం నిర్వాహణతో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభంకానున్నాయి.సాయంత్రం 6గంటల నుంచి అభిషేకములు, రుద్రహోమంవేద పారాయణం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, చండీహోమం, మహిళలచే కుంకుమార్చణ, లలిత సహస్రనామ పారాయణం, ఆదివారం మహా పూర్ణాహుతి,సోమవారం దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా గణపతి పూజ,పుణ్యాహావచనము, 108 కలశాలతో మహా కుంభాభిషేకం, మహా సంప్రోక్షణ అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి సారూ..



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమకు సకాలంలో బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గుడిహత్నూర్ మండలం సీతాగొంది, కమలాపూర్ గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. స్కూల్ బ్యాగులు చేతపట్టుకుని గురువారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ..సీతాగొంది నుంచి గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌కు నిత్యం రాకపోకలు సాగిస్తుంటామని,ఇందుకు నెలకు రూ.వెయ్యి చొప్పున చెల్లించిపాస్‌లు కూడాతీసుకున్నట్లు తెలిపారు. అయితే బస్సులేట్‌గా రావడం, కొన్ని సార్లు తమను చూసి డ్రైవర్ ఆపడం లేదని వాపోయారు. బస్సు ఆలస్యం కారణంగా ప్రతి రోజు గంట పాటు పాఠశాలకు ఆలస్యం అవుతోందని త్వరలో జరిగే పరీక్షలకు కూడా ఆలస్యంగా వెళ్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.పాఠశాలకు తాము సకాలంలో చేరుకునేలా అధికారులు చొరవ చూపాలని, తమ ఇబ్బందిని కలెక్టర్‌కు తెలిపేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

గోరక్షకులపై దాడిని ఖండించిన బీజేపీ



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మళ్లీ హిందులపై దాడులు పెరిగాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ ఆరోపించారు. గోరక్షకుడు ప్రశాంత్ సింగ్ సోనుపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు బీజేపీ నాయకులు యత్నించగా, వారిని పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బ్రహ్మానందం మాట్లాడుతూ..గోరక్షకుడు ప్రశాంత్‌పై విచ్చలవిడిగా గన్‌తో దాడి చేసిన గూండాను అరెస్ట్ చేయాలని, లేని పక్షంలో బీజేపీ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తుంద న్నారు. గోరక్షకుడిపై దాడిని ఖండిస్తూ హైదరాబాద్‌లో బీజేపీ శ్రేణులు నిరసన తెలుపైతే తమ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుని అరెస్టు చేశారని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్, గటిక క్రాంతి కుమార్, భీం సేన్ రెడ్డి, స్వామి, శ్రీనివాస్, శైలేష్, రాకేష్, శ్రీనివాస్, పద్మవార రాకేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.కోటి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి టాటా ఇన్సూరెన్స్ రూ.కోటి చెక్కు అందజేస్తున్న ఎస్పీఅఖిల్ మహజన్

ఉట్నూర్/ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.1 కోటి క్లెయిమ్ చెల్లింపు బాధితులకు అందింది. ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన రాథోడ్ నర్సింగ్ నాయక్, అతనొక మాజీ ఎంఎల్ఏ బాపురావు (బోథ్)తమ్ముడు.ప్రభుత్వ ఉద్యోగికావడంతో నాకేందుకు ఇన్సూరెన్స్, నేనెందుకు ఇన్సూరెన్స్ చేయాలి అని ఆలోచించకుండా, నేనున్న లేకున్న నాభార్య పిల్లలకు రక్షణఉండాలనే ముందు చూపుతూ టాటా ఏఐఏలైఫ్ ఇన్సూరెన్సు కంపెనీ లో కోటి రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్ 2021 మార్చిలో 54000 వేల ప్రీమియంతో టర్మ్ పాలసీ తీసుకున్నా రు. ఈ సంవత్సరం ఆగస్టు 1న గుండె పోటుతో మృతి చెందారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూ రెన్సు సంస్థ కు క్లెయిమ్ సెటిల్‌మెంట్ సబ్మిట్ చేసిన 20 రోజులలో మృతుడు భార్యనామిని సంధ్యరాణి రాథోడ్, కుమారుడు జశ్విత్ రాథోడ్‌లకు గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ.కోటి క్లెయిమ్ చెక్కును జిల్లా ఎస్పీఅఖిల్ మహాజన్,మేనేజర్ వీర స్వామి ఆధ్వర్యం లోఅందించారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆదర్శ్‌కుమార్ తో పాటు సంస్థ ప్రతిని ధులు చంద్ర శేఖర్, శ్రీకాంత్,నవీన్ మ హేందర్, టాటా ఏఐఏసల హాదారు రాథోడ్‌రాజేంద్రప్రసాద్,లీడర్‌అరుణరాథోడ్,టీం లీడర్స్ యాదగిరి,మహేందర్,మోతీరాం,పవన్, పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గిరిజనుల దుర్మరణం



బోల్తా పడ్డ బోలారో వాహనం

ఉట్నూర్,అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలోని జన్నారం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉట్నూర్ మండలానికి చెందిన ఇద్దరు గిరిజనులు దుర్మరణం చెందారు. ఉట్నూర్ మండలంలోని గన్‌పూర్‌కు చెందిన దాసండ్ల అంకన్న (48), దంతన్ పల్లి నాగాపూర్ కొలాంగూడకు చెందిన మోతిరం (50) ఇరువురు గిరిజనులు జన్నారం మండలానికి ద్విచక్ర వాహనంపై పనిమీద వెళుతుం డగా జన్నారం వైపు నుంచి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన జైనూర్‌కు వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టి హై స్పీడ్‌లో పొలాల్లోకి దూసుక వెళ్లి మూడు పల్టీలు కొట్టి ఆగింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు దుర్మరణం చెందగా బొలెరో వాహన డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తుంది. ఉట్నూర్ మండలానికి చెందిన ఇద్దరు గిరిజనులు రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందడంతో మండలంలోని ఘన్‌పూర్, దుంతంపల్లి నాగాపూర్‌లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలియడంతో ఆయా గ్రామాలకు చెందిన బంధువులు జన్నారం మండలానికి తరలి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

దుర్గమ్మ ఆలయంలో దొంగతనం



చోరీకి పాల్పడ్డ అనుమానితుడు



ఆలయ ప్రాంగణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ

తాంసి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పట్టపగలు ఆలయంలో దొంగతనం కలకలం రేపుతోంది. ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోడగుట్ట వద్ద గల దుర్గమ్మ ఆలయంలో మధ్యాహ్నాం గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళం ధ్వంసం చేసి మూడు గ్రాముల బంగారం, నగదు, వీటి విలువ మొత్తం రూ.లక్ష 20 వేలు ఉంటుందని అన్నారు. గమనించిన స్థానికులు ఆలయ పూజారి పొచ్చన్న సమాచారం అందించడంతో వెంటనే డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. పొచ్చన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన వ్యక్తి

ఇచ్చోడ,అక్టోబరు,23(ఆంధ్రజ్యోతి):ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రయాణప్రాంగణం సమీపంలో గురు వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాల య్యాయి. స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది తెలి పిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ వైపు నుంచి ఇచ్చోడ వైపు వస్తున్న కారు కుక్కను తప్పించబోయి ముందరున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా.. ద్విచక్రవాహనంపై ప్రయా ణి స్తున్న కిషన్(55)కు తీవ్రగాయాలయ్యాయి.కిషన్ కాలుకు బలమైన గాయాలు కావడంతో అంబులెన్స్ సిబ్బం ది ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్సకోసం ఆదిలా బాద్‌లోని రిమ్స్‌ఆసుపత్రికి తరలించినట్లుఈఎంటీ అనిల్,పైలెట్ వినోద్‌లు తెలిపారు.

గంజాయి మొక్కలు పట్టివేత

» వీటి విలువ రూ.ఒక లక్షా 20 వేలు

ఇంద్రవెల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న నిషేధిత గంజాయి మొక్కలను ఎస్సై ఇసాయన్న దాడులు నిర్వహించి పట్టుకున్నారు. గురువారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దస్నాపూర్ గ్రామ శివారులో కుడే మారుతి (34) అనే వ్యక్తి తన వ్యవసాయ చేనులో పత్తి పంటలో అంతర్గతంగా 12 గంజాయి మొక్కలను సాగు చేస్తుండగా పక్కా సమాచారంపై పోలీసు సిబ్బంది దాడిచేసిసాగు చేస్తున్న 12 గంజాయి మొక్కలు లభించయని తెలిపారు. పట్టుకున్న గంజాయి మొక్కల విలువ మార్కెట్‌లో సుమారు రూ. ఒక లక్షా 20 వేలు ఉంటుందన్నారు.

దహేగాం హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం: ఐద్వా

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దహేగాం మండలంలో మహిళపై జరిగిన హత్య ఘట నను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యురా లు మంజుల పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య భవనం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కులాంతర వివాహం చేసుకున్నందుకు నిండు గర్భిణీని హత్య చేయడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలపై దాడు లను అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

పశువులకు టీకాలు వేయించాలి

» మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్



శాంతాపూర్‌లో పశువుకు టీకా వేస్తున్న మండల పశు వైద్యాధికారి

గుడిహత్నూర్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి) తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని పశుపోషకులను మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ కోరారు.ఉచితగాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని శాంతాపూర్ పశువులకు గాలికుంటు నివారణ టీకా లు వేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నా మని, ప్రతీ పశువుకు వేయించాలని రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వంశీ, పశు సహాయకురాలు పద్మ,మీరా, పోచక్క, సిబ్బంది మోహన్, శివ, రాహుల్ పశు పోషకులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండల పశువైద్యాధికారి డాక్టర్ రాథోడ్ జీవన్ గురువారం మండలంలోని గుత్పాల గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువులకు అందించే ఈ ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పశుపోశకులను సూచించారు. పశువులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన



ఆయుధాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం విద్యార్థులకు పోలీసులవిధులు, ఆయుధాలపై ఏఎస్పీ రాజేష్ మీనా అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంసందర్భంగా ఫ్లాగ్‌డే కార్యక్రమంలో భాగంగావిద్యార్థులతో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో ఫంక్షన్ చట్టాలు అమలుపరుస్తున్న తీరును, కేసున మోదు,నేరస్తులను నిర్ధారించడం,ప్రజల జాగ్రత్తల పట్ల తీసుకుంటున్న చర్యలను వివరించారు.మహిళలకు,చిన్నపిల్లలకు ఉన్నటువంటి చట్టాల గురించి, ట్రాఫిక్ నిబంధనల గురించి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలకు విద్యార్థులు అలవాటు పడితే జీవితం ఎలా నాశనం అవుతుందో ప్రత్యేకంగా వివరించారు. సమాజంలో పోలీసులు పొందుపరుస్తున్న ముఖ్య విధుల గురించి తదితర అంశాల గురించి సైబర్ నేరాల పట్ల పోలీసులు ఉపయోగిస్తున్న నూతన టెక్నాలజీని, సీఈఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ రికవరీ, కమ్యూనికేషన్ వీహెచ్ ఎఫ్‌సెట్ తదితర అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.అలాగే పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాటి ప్రత్యేకతలు, తదితరవి గురించి క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలోటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసులు,సిబ్బంది,పాల్గొన్నారు.

జీసీసీ ఆసిఫాబాద్ సొసైటీ మేనేజర్‌గా సందీప్ కుమార్



బాధ్యలు చేపట్టిన సందీపకుమార్

ఉట్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆసిఫాబాద్ సొసైటీ మేనేజర్‌గా ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ (డీఎం) గుడిమళ్ల సందీప్ కుమార్‌ను నియమిస్తూ గిరిజనసంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ సొసైటీ కార్యాలయంలో మేనేజర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు.ఆసిఫాబాద్‌లో పనిచేస్తున్న మేనేజర్ తారా చంద్ అనారోగ్య కారణాలతో సెలవులో వెళ్లడంతో సందీప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది సదాశివం, గోవిందరావు, చందు, సంతోష్, ప్రియాంక తదితరులు సందీప్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ, పోలీసు అధికారులు

పట్టణంలో సైకిల్ ర్యాలీ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి నిర్వహించిన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొని అమరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, దేవి చంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్‌చౌక్, నేతాజీచౌక్, బసవేశ్వర చౌక్, బస్టాండ్ మీదుగా ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, ఇంద్రవర్ధన్, పట్టణ సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో దీపోత్సవం

ఉట్నూర్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27, 28 తేదీల్లో కార్తీక దీపోత్సవాన్ని మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ క్రీడమైదానంలో నిర్వహిస్తున్నట్లు కార్తీక దీపోత్సవ సమితి ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీఏటా నిర్వహిస్తున్నట్టే ఈ ఏడాది నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్దఎత్తున పాల్గొలని కోరారు.

రైతులకు కపాస్ కిసాన్‌పై అవగాహన


యాప్ గురించి వివరిస్తున్న ఏఈవో మహేష్

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ రైతు వేదికలో గురువారం రైతులకు కాపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో మహేష్ మాట్లాడుతూ సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరకు పత్తిపంట అమ్మడానికి రైతులు తప్పనిసరిగా ప్రతిఒక్కరూ కపాస్ కిసాన్ యాప్ ఉపయోగించాలని, అందుకు యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు. ఆధార్‌కార్డుకు లింక్ ఉన్న మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయ్యి స్లాట్‌బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఫోన్‌నెంబర్ ఆధార్, పట్టాపాస్ బుక్కు లింకు లేకపోతే తమ వద్దకు నెంబర్‌ను పట్టా పాస్‌బుక్‌తో లింక్ చేసి ఇస్తామని తెలిపారు. కపాస్‌కిసాన్ కింద స్లాట్ బుక్ చేసిన తేదీరోజు మాత్రమే రైతు తన పత్తి పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని చెప్పారు. రైతు స్లాట్ బుకింగ్ తేదీన రాలేకపోతే రైతు ఒకరోజు ముందు స్లాట్‌ను రద్దు చేసుకుని మళ్లీ బుక్ చేసుకోవాలని సూచించారు.


కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా
ముందుకు సాగాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆదిలాబాద్ కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. రాంపూర్ గ్రామప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను శాయ శక్తులా కృషి చేస్తానని అన్నారు. గురువారం భోరజ్ మండలం రాంపూర్‌లో ఆయన పర్యటించారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాంపూర్ గ్రామం తనను ఓట్లతో ఆశీర్వదించిందని, ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకునే బాధ్యత తనదని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ రాని విధంగా ఓట్లు 48 వేలకు పైగా ఓట్లు వచ్చినాయన్నారు. త్వరలో రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్‌రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, జైనథ్ ఆలయ చైర్మన్ రుకేష్ రెడ్డి, మునిగెల విఠల్, సందానర్సింగ్, శాంతన్‌రావు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లను ప్రారంభించాలి

ఆదిలాబాద్‌టౌన్,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): సోయాబీన్ కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు కోరారు. ఈనెల 27 నుంచి పత్తి కొనుగోళ్ల ప్రారంభం కానుందని కానీ సీసీఐ జారీచేసిన సర్క్యూలర్ 8 నుంచి 12శాతం తేమ ఉంటేనే కొంటామని నిబంధన పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికే రైతులు అధిక వర్షాలతో తీవ్రంగా నష్టపోయి ఉన్నారని వాపోయారు. తేమ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు.

నేరడిగొండ: సోయాబీన్ పంట కొనుగోలును ప్రభుత్వం తక్షణమే ప్రారంభించాలని భారతీయ జనతా పార్టీ నేరడిగొండ మండల అధ్యక్షులు ఆకుల రాజశేఖర్ డిమాండ్‌చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ రైతులకు పంటచేతికి వచ్చి 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించలేదని అన్నారు. రైతులు స్థానిక మార్కెట్ యార్డులలో పంటను ఆరబోసి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొనుగోలు ఆలస్యం కావడంతో కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే పంటను అమ్ముకుని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు.

కరాటే మాస్టర్లు దరఖాస్తు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కరాటే నేర్పేందుకు కరాటే మాస్టర్ పోస్టు కోసం దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈఓ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఆదిలాబాద్‌లో పాఠశాల వారీగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. స్థానికత, అనుభవం ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మహిళా కరాటే మాస్టర్లకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ టు అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపో నుంచి తమిళనాడు అరుణాచలం గిరిప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించినట్లు ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి గురువారం తెలిపారు. ఈ బస్సు నవంబరు 8న బయల్దేరి కాణిపాకం, వెల్లూరు గోల్డెన్ టెంపుల్, అరుణాచలం గిరిప్రదక్షిణ పూర్తిచేస్తుందని పేర్కొన్నారు. వచ్చే క్రమంలో జోగులాంబ దేవాలయం వెళ్లి 11న రాత్రి 10 గంటలకు ఆదిలాబాద్ చేరుకుంటుందని తెలిపారు.



ఇళ్లలోనే పంట దిగుబడులు

- కొనుగోళ్ల కోసం రైతులకు తప్పని ఎదురుచూపులు
- అకాల వర్షాలతో ఆందోళన
- పెట్టుబడి ఖర్చుల పేరిట కష్టమంతా దళారుల పాలు
- పక్షం రోజులుగా పంట కుప్పల వద్దే పడిగాపులు

జిల్లాలో పంట కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో పంట దిగుబడులు రైతుల ఇళ్ల వద్దే కనిపిస్తున్నాయి. చేతికి వచ్చిన పత్తి, సోయాపంటలను రైతులు ఇంటికి తరలిస్తూ ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. దసరా, దీపావళి పండుగలు ముగిసిన ఇంకా కొనుగోలు ప్రక్రియను ప్రారంభించకపోవడంతో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఆదిలాబాద్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈసారి పత్తిపంట 4లక్షల 31వేల ఎకరాలు, 82వేల ఎకరాలలో సోయా పంట సాగైంది. తొలిపంటలుగా చెప్పుకునే పత్తి, సోయా పంటలను అమ్ముకునేందుకు రైతులు పడరాన్ని పాట్లు పడతున్నారు. ఇప్పటికే పత్తి కొనుగోళ్లపై స్పష్టత వచ్చిన ఇంకా సోయా కొనుగోళ్లపై అధికారులు ఉసేత్తడమే లేదు. ఈ నెల 27 నుంచి ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోలను ప్రారంభించనున్నారు. మొదట ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోలను ప్రారంభించి ఆ తర్వాత నవంబర్ మొదటివారంలో మిగతా కేంద్రాల్లో ప్రారంభిస్తారు.

అయితే ఇప్పటికే చేతికి వచ్చిన పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక ఆదరాబాదరగా అమ్మేసుకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులకు ముందుచూపు లేకపోవడంతో ప్రతీఏటా ఇవే పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

ఉరుకులు పరుగులు..

నిత్యం కురుస్తున్న వర్షలతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పంట కుప్పలను వదిలి వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లే పరిస్థితి లేదంటున్నారు. నిత్యం పంటలను ఆరబోయడం వర్షం రావడంతో కుప్పలు చేయడం రైతులకు ఇదో పనిగా మారుతుంది. కురుస్తున్న వర్షాలకు పంటలు తడిసి నలుపు బారిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. నాణ్యత దెబ్బతిని మద్దతు ధర దక్కడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతన్నాయి. సోయా పంట కోతలు నూర్పిడి పత్తి ఏరేందుకు వర్షాలు ఆటంకంగా మారుతున్నాయి. అధిక తేమతో పంటలను అమ్ముకునేందుకు అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికే సోయా మొలకలు రావడం పత్తి నలుపుబరాడంతో దిగుబడులపై ప్రభావం పడుతుంది.

దళారుల మోసం..

సమయానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతుల కష్టమంతా దళారుల పాలవుతోంది. సగం పంట దిగుబడులను అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ఫలితం ఉండదుంటున్నారు. దీంతో మద్దతు ధర దక్కక రైతులు నష్టపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కొంతమంది రైతులకు మాత్రమే మద్దతు ధర దక్కుతున్నట్లు (వివరాలు 6లో..)


అధిక వర్షాలకు నీటి వరదకు కనిపించని పత్తి పంట

చిన్నబోయిన తెల్ల బంగారం!

- వరుస నష్టాలతో పత్తి రైతు కుదేలు
- ఆదుకోవాలని విన్నపం

బజార్‌హత్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పత్తి ఒకనాడు అన్నదాతల పాలిట తెల్ల బంగారమై కాసులు తెచ్చిపెట్టింది. కానీ నేడు పరిస్థితులు మారాయి. వాతావరణంలో మార్పులతో రానురాను కష్టాలు పెరిగాయి. పెట్టుబడి పెరిగి అమాంతంగా దిగుబడి తగ్గి సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఈ ఏడాది ప్రారంభం నుంచే అధికవర్షాలకు పత్తిపంట ఎదగలేదు. మండలంలో ఈ ఏడాది సుమారుగా 22వేల ఎకరాల్లో పత్తి సాగవగా దిగుబడిపై రైతుల ఆశలు సన్నగిల్లాయి. ఏకధాటి కురిసిన వర్షాలకు కాసిన కా యలు పచ్చిగానే ఉండగా బొగడగా ఉన్నచోట పత్తిచెట్టు తట్టుకున్నా ఆశించినంత కాతలేదు. పంటను బతికించే ప్రయత్నంలో సస్యరక్షణ చర్యలు చేపట్టినా వాతావరణం అందుకు సహకరించలేదు. మదుగు భూముల్లో పత్తి ఎర్రబారి పరిస్థితి దారుణంగా మారింది. వారం రోజులుగా ఎండలు కాస్త పెరగడంతో లోతట్టు భూముల్లో ఒకసారికే కాతకాసి తెల్లగా మెరిసి కనిపిస్తోంది. బజార్‌హత్నూర్ మండల కేంద్రం సమీపంలో ఓ పత్తి చేనులో ఒకసారికే కాత కాయగా మరో చేనులో అధిక వర్షాలకి పత్తి పంట కనిపించకుండా పోయిన దృశ్యాలివి.


మొక్కలు ఎదగక ఒకసారికే కాసిన పత్తి పంట

ముగిసిన మద్యం టెండర్ల గడువు

- సమయం పెంచినా.. స్పందన కరువు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 40 మద్యం దుకాణాలకు రెండేళ్ల కాల పరిమితితో చేపట్టిన టెండర్ల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈనెల 18కే టెండర్ల స్వీకరణ గడువు ముగియగా.. 2023తో పోలిస్తే దరఖాస్తులు తగ్గాయి. వివిధ కారణాలతో దరఖాస్తుల సంఖ్య తగ్గిందని భావించిన ఎక్సైజ్ శాఖ గడువు తేదీని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గురువారం వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగింది. అయితే చివరిరోజు నాటికి మొత్తం 767 టెండర్‌లు మాత్రమే దాఖలైనట్లు అధికారులు తెలిపారు. ఈనెల 27న డ్రా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో
నాణ్యత పాటించాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ గురువారం ఉట్నూర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని సాలెగూడా, ఉమ్రి, రాముగూడా, బీర్సాయిపేట, కొలాంగూడా, ధర్మాజీ గ్రామాలలో పర్యటించారు. సాలెగూడలో 74, రాముగూడాలు 56, ధర్మాజీపేటలో 31, కొలాంగూడలో 36 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అంతకుముందు ఇందిరమ్మ లబ్ధిదారులకు గృహాల మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు సొంతింటి కలను ఇందిరమ్మ ఇల్లుతో నిజం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ జయవంత్ రావు, ఆర్టీఏ జిల్లా సభ్యులు రాజేశ్వర్, లిం గంపల్లి చంద్రయ్య, ఇక్బాల్, దాసండ్ల ప్ర భాకర్, ముకుందరావు, అన్సారి ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గల భవితకేంద్రంలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థులు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి సునీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష అభియాన్ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఏడో తరగతి పాసై ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రంతో ఈనెల 30న దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెద్దల స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా


పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

- బోరిగామలో గ్రాండ్ పేరెంట్స్ పాదపూజ కార్యక్రమం
- హాజరైన కలెక్టర్ రాజార్షిషా

ఇచ్చోడ,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): నేటి యువతరం పెద్దల స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. మండలంలోని బోరిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ, వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్‌డే పాద పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజార్షిషా హాజరై మాట్లాడారు. గ్రాండ్ పేరెంట్స్ మన కుటుంబాల మూల స్తంభాలని, వారు సృష్టించిన విలువలే నేటి తరానికి మార్గదర్శనం అన్నారు. వయస్సు పెరిగినా వారి అనుభవం, ఆలోచనలు ఎప్పటికీ సమాజానికి దారి చూపిస్తాయని అన్నారు. అనంతరం విద్యార్థులు వారి అమ్మమ్మ, తాతయ్యలకు పాద పూజచేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన యోగా ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్, వయోవృద్ధులను అధికారులను గ్రామస్థులు శాలవాతో సన్మానించారు. పాఠశాల ప్రాంగణంలో వయోవృద్ధులు, అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి మిల్కా, వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షులు దేవిదాస్ దేశ్‌పాండే, ఉపాధ్యక్షుడు గంగారాం, రాము, ఎంపీడీఓ సత్యానంద్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ జాదవ్, పాఠశాల సిబ్బంది రాజేష్, రామాకాంత్ తదితరులు పాల్గొన్నారు.